## కరాటే ఛాంపియన్ దీక్షితకు సన్మానం



శెనార్తి మీడియా, మంచిర్యాల:

ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గూడెపు దీక్షితకు ఘన సన్మానం లభించింది. రామకృష్ణాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న దీక్షితను, ఆమె కోచ్ జూల శ్రీనివాస్‌ను తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కే చందర్, రామకృష్ణాపూర్ టౌన్ అధ్యక్షుడు నడిగోట తిరుపతి, మందమర్రి మండల అధ్యక్షుడు పైతర ఓదెలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ... కరాటేలో రాణిస్తున్న దీక్షితకు సంఘం ఎల్లప్పుడూ తోడుంటుందని, అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కరాటే వంటి క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ధైర్యసాహసాలు పెంచుతాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, సాంఘిక సంక్షేమ, కస్తూర్బా హాస్టళ్లలో విద్యార్థులకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## జాగ్రత్తగా టీకాలు ఇవ్వాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత

శెనార్తి మీడియా, మంచిర్యాల :

సుందరయ్య కాలనీలోని నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన అవుట్ రీచ్ టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. టీకా కార్యక్రమం సజావుగా సాగుతున్న విధానాన్ని ఆమె సమీక్షించారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం ఉపకేంద్ర స్థాయిలో, శనివారం గ్రామ స్థాయిలో జాతీయ టీకా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందు కోసం ఆశా ఆరోగ్య కార్యకర్తలు ముందస్తుగా గ్రామాల్లో పిల్లల వివరాలను సేకరించుకోవాలని సూచించారు. వాక్సినేషన్ సమయంలో తల్లులకు పూర్తి అవగాహన కల్పిస్తూ, తదుపరి టీకా తేదీని కూడా తెలియజేయాలని సూచించారు. వ్యాక్సిన్ క్యారియర్లు శుభ్రంగా ఉంచడమే కాకుండా, ఐస్ ప్యాక్లు సక్రమంగా నిల్వ చేయాలని తెలిపారు. జాతీయ టీకా కార్యక్రమంలో జిల్లాను ముందంజలో ఉంచేందుకు ప్రతి కేంద్రం నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. నవజాత శిశువులకు టీకాలు ఇస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చిన యువకుడు

శెనార్తి మీడియా, బోథ్



బోథ్ నుంచి సోనాల మార్గంలోని టివిటీ పల్లె రహదారిపై వర్షాల ప్రభావంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే మార్గంలో ప్రతిరోజు ప్రయాణించే బోథ్ మండల కేంద్రానికి చెందిన యువకుడు ప్రమోద్ ఈ సమస్యను గమనించి ఇంటి నుంచి బకెట్ తీసుకొని స్వయంగా గుంతలు పూడ్చాడు. అతని చర్యకు టివిటీ గ్రామానికి చెందిన కొడప జైతు, కొడప గంగాధర్ సహకరించారు. ప్రజా బాధ్యతతో ముందుకొచ్చిన ప్రమోద్ చర్యను పలువురు అభినందించారు

## సోయా కొనుగోలు రెండు రోజులు నిలిపివేత

శెనార్తి మీడియా, బోథ్




బోథ్ మార్కెట్‌లోని సోయా, మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అధిక మొత్తంలో పంట నిల్వ ఉండటంతో కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈఓ గోలి స్వామి తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో కొనుగోళ్లు జరగవు. తిరిగి 11వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని రైతులు గమనించి సహకరించాలన్నారు.

## దుండిగల్‌లో మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం?

శెనార్తి మీడియా, హైదరాబాద్:



మేడ్చల్ జిల్లాలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో జరిగిన దారుణ హత్యతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. వివాహేతర సంబంధం ఈ ఘోరానికి కారణమైందని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించారు. సూరారం రాజీవ్ గృహకల్పకు చెందిన సున్నపోల్ల రమేష్ (35)కు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన స్వాతి (28)తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సాత్విక్ (12), వర్షిత్ (9) ఉన్నారు. ఐదు సంవత్సరాల క్రితం కుటుంబ విభేదాల కారణంగా రమేష్ దంపతులు పిల్లలతో కలిసి గ్రీన్ హిల్స్ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఆ అపార్ట్‌మెంట్ యజమాని ఎల్లమ్మబండకు చెందిన బోయ కిషన్ (52) రౌడీ షీటర్‌గా చలామణి అవుతున్నాడు. అతను ఆర్థిక ప్రలోభాలతో స్వాతితో సాన్నిహిత్యం పెంచుకున్నాడు.

**భర్తపై కేసులు..**

స్వాతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన రమేష్ పలుమార్లు మందలించినా, ఆమె కిషన్‌తో బంధం కొనసాగించిందని పోలీసులు తెలిపారు. రమేష్‌ను జైలుకు పంపేలా స్వాతి, కిషన్, ఆమె తల్లి మల్లమ్మ కలిసి కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. అనంతరం ఇద్దరూ సహజీవనం కొనసాగించారు.

**ఆస్తి కోసం ఘర్షణ**

స్వాతి తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబట్టడంతో కిషన్ కుటుంబంలో వివాదం చెలరేగింది. దీనిపై కిషన్ భార్య, కుమార్తె, అల్లుడు రాజేష్ వారిని విడిపోవాలని హెచ్చరించినా ఫలితం లేకపోయింది.

**పథకం ప్రకారమే హత్య**

శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో కిషన్ భార్య, కుమార్తె, అల్లుడు రాజేష్, పనిమనిషి కలిసి పథకం ప్రకారం స్వాతిని గొంతు కోసి హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం అల్లుడు రాజేష్ పోలీసులకు లొంగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని దుండిగల్ సీఐ సతీష్ తెలిపారు.

## బీహార్‌లో అఖిలేశ్ యాదవ్ జోరు

- మహాఘుట్‌బంధన్‌కు ఊపు..
- నితీశ్‌పై ఘాటు విమర్శలు

శెనార్తి మీడియా, పాట్నా :



బీహార్ ఎన్నికల వేళ రాజకీయ వేడి రోజు రోజుకు పెరుగుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే ప్రయత్నంగా సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీహార్‌లో బలంగా ప్రచారం చేపట్టారు. మహాఘట్బంధన్ లేదా ఇండియా బ్లాక్ తరపున ఎన్నికల ప్రణాళికను ముందుకు తీసుకెళ్లే నాయకులలో అఖిలేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన ప్రచారం ప్రధానంగా వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనార్టీలు, రైతులు వంటి వర్గాల మధ్య కూటమి బలాన్ని పెంపొందించడంపై దృష్టి సారించింది.

ఉత్తరప్రదేశ్‌లో తన రాజకీయ ప్రాధాన్యతను స్థిరపరచుకున్న అఖిలేశ్ యాదవ్, ఇప్పుడు బీహార్ ప్రజల్లో మహాఘట్బంధన్ పట్ల నమ్మకాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆయన రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్‌తో కలసి సంయుక్తంగా ప్రచార వేదికను పంచుకోవడం ద్వారా ప్రతిపక్ష ఐక్యతకు కొత్త ఊపు తీసుకొచ్చారు. ఇద్దరు యువ నాయకులు కలిసి బీహార్ రాజకీయాల్లో మార్పు తేవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

అఖిలేశ్ నవంబర్ 1 నుంచి 5 వరకు బీహార్‌లో విస్తృత ప్రచార పర్యటన చేపట్టారు. పూర్ణియా నుంచి భాగల్‌పూర్ వరకు అనేక నియోజకవర్గాలను సందర్శించి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. తరువాత నవంబర్ 6న ఈస్ట్ చంపారణ్ (మోతిహారి), సీతామఢి జిల్లాల్లో, నవంబర్ 8న పూర్ణియా (ధంఢాహా), మధుబనీ (రాజ్‌నగర్), బిస్కీ ప్రాంతాల్లో సభలను నిర్వహించనున్నారు. ఆయన సభలకు భారీగా ప్రజలు హాజరై మహాఘట్బంధన్ పట్ల ఉత్సాహం చూపిస్తున్నారు.

తన ప్రసంగాల్లో అఖిలేశ్ యాదవ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, అలాగే బీహార్‌లో ఉన్న అనుబంధ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. నిరుద్యోగం, యువత వలసలు, ద్రవ్యోల్బణం, కమ్యూనల్ రాజకీయాలు వంటి అంశాలపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను “ఎన్నికల వరుడు”గా సంబోధిస్తూ, ఆయనకు సీఎం పదవి ఈసారి దక్కదని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాజకీయ పరిణామాలను ఉదాహరణగా చూపిస్తూ, బీహార్‌లో కూడా అలాంటి రాజకీయ మార్పు తప్పదని ఆయన పేర్కొన్నారు.

అఖిలేశ్ తన ప్రసంగాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ సృష్టి, రైతు సంక్షేమం, విద్యా వ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రాధాన్యంగా ప్రస్తావిస్తున్నారు. ఆయన ప్రచారం బీహార్‌లోని యువతలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. ఇండియా బ్లాక్ కూటమి బీహార్ ఎన్నికలపై చూపుతున్న ప్రాధాన్యతకు అఖిలేశ్ పర్యటన ఒక సూచికగా మారింది.

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అఖిలేశ్ యాదవ్ బీహార్‌లో సక్రియంగా ప్రచారం చేయడం వెనుక వ్యూహాత్మక ఉద్దేశం ఉంది. ఉత్తరప్రదేశ్–బీహార్ మధ్య సామాజిక సమీకరణాలు, ముఖ్యంగా యాదవ్, ముస్లిం, ఓబీసీ వర్గాల మద్దతు కేంద్రీకరణకు ఇది తోడ్పడుతుందని వారు భావిస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ మైత్రి ఏర్పడితే, భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో బీజేపీకి గట్టి సవాల్‌గా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇలా బీహార్‌లో అఖిలేశ్ యాదవ్ ప్రచారం కేవలం ఎన్నికల కార్యక్రమం మాత్రమే కాకుండా, ఉత్తర భారత రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే దిశగా సాగుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బీహార్ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్న ఈ సమయంలో, అఖిలేశ్ మరియు తేజస్వీ జోడీ ఆ ఆశలకు కొత్త ఊపు నిచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

## వరిధాన్యం కాంటాల వివాదం..



- రైతుల ఆగ్రహం, పోలీసుల జోక్యం
- గంటపాటు రాకపోకలు నిలిచిన
- నర్సింగాపూర్ గ్రామంలో ఘటన

శెనార్తి మీడియా, కరీంనగర్(వీణవంక) :

కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో వరిధాన్యం కాంటాలపై చోటుచేసుకున్న వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. శనివారం మధ్యాహ్నం పోలీసులు వరిధాన్యం కాంటాలు ఆపారని ఆరోపిస్తూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జమ్మికుంట–కరీంనగర్ ప్రధాన రహదారిపై వరిధాన్య బస్తాలు వేసి రైతులు సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. స్థానికుల వివరాల ప్రకారం, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు గత పది రోజులుగా రోడ్డుపై వరిధాన్యం ఆరబోస్తున్నారు. పంటను కాంటాలు వేయాలంటూ స్థానిక హమాలీలకు సమాచారం ఇచ్చినప్పటికీ, వారు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా పనిని ప్రారంభించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో బీహార్ రాష్ట్రానికి చెందిన హమాలీలను పిలిచి రైతులు కాంటాలు వేయించటం ప్రారంభించగా, స్థానిక హమాలీలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి వరిధాన్యం కాంటాలు నిలిపివేయడం రైతుల ఆగ్రహానికి కారణమైంది. రైతులు పోలీసుల ఈ చర్యను “అన్యాయం”గా పేర్కొంటూ “పోలీసు జులుం నశించాలి” అంటూ నినాదాలు చేశారు. కొద్ది సేపు రైతులు, పోలీసులు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఈ పరిణామాలపై ఎస్సై ఆవుల తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. ఆయన మాట్లాడుతూ, “మీకు నచ్చిన హమాలీలతోనే కాంటాలు వేసుకోవచ్చు. పోలీసుల ఉద్దేశం ఎవరికీ ఇబ్బంది కలగకుండా పరిస్థితిని చక్కదిద్దడమే” అని స్పష్టం చేశారు. రైతులు, హమాలీలు పరస్పరం మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. తర్వాత రైతులు ఎస్సై హామీతో ధర్నా విరమించి వెళ్లిపోయారు. అయితే గ్రామంలో ఇంకా కొంత అసంతృప్తి కొనసాగుతూనే ఉంది. స్థానిక రైతులు, హమాలీల మధ్య ఈ విభేదం పరిష్కారం కాని పక్షంలో భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో వివాదం తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో కాంటాలపై తలెత్తిన ఈ ఘటన ప్రస్తుతం మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



## అక్రమ కలప వ్యాపారంపై ఉక్కుపాదం

- ఫర్నిచర్ యంత్రం, కలప స్వాధీనం

శెనార్తి మీడియా, మంచిర్యాల :

అక్రమంగా కలప వ్యాపారం చేస్తున్నవారిపై అటవీ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం ఊరు శ్రీరాంపూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కలపతో ఫర్నిచర్ తయారీ కేంద్రం నడుపుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడిలో భారీగా అక్రమ కలపతో పాటు ఫర్నిచర్ తయారీకి ఉపయోగించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వస్తువుల మొత్తం విలువ సుమారు మూడు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ.. అక్రమ కలప ద్వారా ఫర్నిచర్ తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలప వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు.



## నేరడిగొండలో పత్తి రైతుల ఆందోళన

- సీసీఐ కొనుగోలు విధానంపై తీవ్ర ఆగ్రహం

శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలో పత్తి రైతులు జాతీయ రహదారి–44పై ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలకు రూ.8,110గా ఉన్నప్పటికీ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తేమ శాతం ఎక్కువగా ఉందని పంట కొనుగోలు చేయడానికి నిరాకరిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమ 8 శాతం మించితే మద్దతు ధర చెల్లించబోమని అధికారులు చెబుతున్నారని రైతులు వెల్లడించారు. అయితే, జిల్లాలో ఇటీవల వర్షాలు, మంచు కారణంగా పంటలో తేమ శాతం సహజంగానే పెరిగిందని, ఈ పరిస్థితుల్లో కొంత సడలింపు ఇవ్వాలని సీసీఐ అధికారులను పలుమార్లు కోరినప్పటికీ, స్పందించలేదని రైతులు మండిపడ్డారు. పత్తి రైతులు తమ పంటను ‘కపాస్ కిసాన్’ యాప్ ద్వారా నమోదు చేసుకున్నప్పటికీ, మొదట ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన సీసీఐ అధికారులు ఇప్పుడు కేవలం ఏడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. మిగిలిన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని వారు తెలిపారు. పత్తి ధరలు తగ్గిపోవడం, మద్దతు ధర అందకపోవడం వల్ల రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో పాల్గొన్న రైతులు సీసీఐ విధానాన్ని తక్షణం సవరించాలని, తేమ శాతం కారణంగా కొనుగోలు నిలిపివేయకూడదని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలని కోరారు. నిరసన తీవ్రరూపం దాల్చడంతో జాతీయ రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపి రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు.